# 48

# దేవుని విశ్వసనీయత

## (యెషయా 51)

51–53 అధ్యాయములు మాటతప్పని దేవుడు సీయోనుకును తుదకు ఆయనయందు విశ్వసించువారికందరికిని రక్షణను సమకూర్చునని ఇచ్చిన వాగ్దానములను నెరవేర్చుటలో ఆయన కనపరచు విశ్వసనీయతను చిత్రీకరించుచున్నవి. దేవుడు గతంలో తన ప్రజల పట్ల ప్రవర్తించిన తీరును వారిని ఆశీర్వదించిన విధానాన్ని జ్ఞాపకమునకు తెచ్చుట ద్వారా విశ్వాసమును పెంపొందించవలెననునది ఈ అధ్యాయముల ఆశయమై యున్నది. యెషయా గ్రంథాన్ని అధ్యయనం చేయువారికి వాగ్దానం చేయబడిన దేవుని దీవెనలు అనుగ్రహింపబడునంత వరకు విశ్వాసంతో వేచియుండవలెనని వారిని ఇది ప్రోత్సాహిస్తుంది.

### "అబ్రాహాము సంగతి ఆలోచించుడి" (51:1–3)

నీతిని అనుసరించుచు యెహోవాను వెదకుచు నుండు వారలారా, నా మాట వినుడి
మీరు ఏ బండనుండి చెక్కబడితిరో దాని ఆలోచించుడి
మీరు ఏ గుంటనుండి త్రవ్వబడితిరో దాని ఆలోచించడి
మీ తండ్రియైన అబ్రాహాము సంగతి ఆలోచించుడి
మిమ్మును కనిన శారాను ఆలోచించుడి
అతడు ఒంటరియై యుండగా నేను అతని పిలిచితిని
అతనిని ఆశీర్వదించి అతనిని పెక్కుమంది యగునట్లు చేసితిని.
యెహోవా సీయోనును ఆదరించుచున్నాడు
దాని పాడైన స్థలములన్నిటిని ఆదరించి
దాని ఆరణ్యస్థలములను ఏదెనువలె చేయుచున్నాడు
దాని యెడారి భూములు యెహోవా తోటవలె నగునట్లు చేయుచున్నాడు
ఆనంద సంతోషములును కృతజ్ఞతాస్తుతియు
సంగీతగానమును దానిలో వినబడును.

నీతిని వెంటాడుటకు క్రియాశీలకంగా వెదకుచుండినవారిని సూచించుచూ, ఈ విభాగము "నీతిని అనుసరించువారికి" సంబోధింపబడి యున్నది (1 వచనం). "నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు" అని యేసు ఇచ్చిన వాగ్దానమును ఇది మనకు గుర్తుచేయుచున్నది (మత్తయి 5:6). "*నీతి*" అనునది " 'దేవునితో సఖ్యముగా నున్న' జీవితంలోని అన్ని కోణాల్లోను అణువణువున అగుపించు అంశమై యున్నదని" జే. అలెక్ మోటెయిర్ చెప్పుచున్నాడు.[1]

"మీరు ఏ బండ నుండి చెక్కబడితిరో దాని ఆలోచించుడి" అను మాటలు అబ్రాహామును, విశ్వాసులకు తండ్రియైనవానిని, సూచించుచున్నవి (2 వచనం). రాళ్లుకొట్టు వారు ఒక పెద్ద బండను పరీక్షించి దానిలో నుండి మంచి రాతిని వెలికి తీయునట్లు, ఇశ్రాయేలు అబ్రాహాము

నుండి "వెలికితీయబడినది." దేవుడు అబ్రాహామును పిలిచిన వివరము ఆదికాండము 12:1-3 వచనములలో కలదు:

> "యెహోవా - 'నీవు లేచి నీ దేశమునుండియు, నీ బంధువులయొద్ద నుండియు, నీ తండ్రి యింటినుండియు, బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము; నిన్ను గొప్ప జనముగా చేసి, నిన్ను ఆశ్వీర్వదించి, నీ నామమును గొప్ప చేయుదును; నీవు ఆశీర్వాదముగా నుందువు; నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను. భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదింపబడునని' అబ్రాముతో అనెను."

ఇది వంద సంవత్సరాలు సాగిన గొప్ప గోత్రజనకుని యొక్క ఆధ్యాత్మిక సుదీర్ఘ సంఘటనాత్మక ప్రయాణమును ఆరంభించినది. హెబ్రీ పత్రిక రచయిత అబ్రాహామును "పేరుప్రఖ్యాతులుగాంచిన విశ్వాసవీరుల జాబితాలో" ఎందుకు చేర్చాడో అర్థంచేసికొనుటకు ఆదికాండము 12-25 అధ్యాయాలు మరొకసారి చదవండి:

> "అబ్రాహాము పిలువబడినప్పుడు, విశ్వాసమునుబట్టి, ఆ పిలుపునకు లోబడి తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలు వెళ్లెను; మరియు ఎక్కడికి వెళ్లవలెనో, అది ఎరుగక బయులువెళ్లెను, విశ్వాసమునుబట్టి అతడును, అతనితో ఆ వాగ్దానమునకు సమానవారుసులైన ఇస్సాకు యాకోబు అనువారును, గుడారములలో నివసించుచు, అన్యుల దేశములో ఉన్నట్టుగా, వాగ్దత్తదేశములో పరవాసులైరి; ఏలయనగా దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో, పునాదులుగల ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురుచూచుచుండెను" (హెబ్రీయులకు 11:8-10).

దేవుడు తన వాగ్దానములను నెరవేర్చుటకు ఆయన అబ్రాహాము యెడల ఎలా విశ్వసనీయుడై యుండెనో, అలాగే ఆయన "సీయోనును ఆదరించుచు" (3 వచనం). "దాని అరణ్య స్థలములను ఏదెనువలె చేయును" అని ప్రవక్త చెప్పుచున్నాడు (ఆదికాండము 2:8-14తో పోల్చి చూడుము).

### "నా నీతి శాశ్వతమైనది" (51:4-8)

దేవుడు తన ప్రజల పట్ల గతంలో చూపిన విశ్వసనీయత ఆధారంగా వారికి ఒక సవాలు విసరబడినది.

> "నా ప్రజలారా, నా మాట ఆలకించుడి
> నా జనులారా, నాకు చెవియొగ్గి వినుడి.
> ఉపదేశము నాయొద్దనుండి బయలుదేరును
> జనములకు వెలుగు కలుగునట్లుగా నా విధిని నియమింతును.
> నేను ఏర్పరచు నా నీతి సమీపముగా ఉన్నది
> నేను కలుగజేయు రక్షణ బయలుదేరుచున్నది
> నా బాహువులు జనములకు తీర్పుతీర్చును
> ద్వీపవాసులు నా తట్టు చూచి నిరీక్షణ గలవారగుదురు
> వారు నా బాహువును ఆశ్రయింతురు.
> ఆకాశమువైపు కన్ను లెత్తుడి
> క్రింద భూమిని చూడుడి
> అంతరిక్షము పొగవలె అంతర్ధానమగును

> భూమి వస్త్రమువలె పాతగిలిపోవును
> అందలి నివాసులు అటువలె చనిపోవుదురు
> నా రక్షణ నిత్యముండును నా నీతి కొట్టివేయబడదు.
> నీతి అనుసరించువారలారా, నా మాట వినుడి
> నా బోధను హృదయమందుంచుకొన్న జనులారా, ఆలకించుడి
> మనుష్యులు పెట్టు నిందకు భయపడకుడి వారి దూషణ మాటలకు దిగులుపడకుడి.
> వస్త్రమును కొరికివేయునట్లు చిమ్మట వారిని కొరికివేయును
> బొద్దీక గొఱ్ఱెబొచ్చును కొరికివేయునట్లు వారిని కొరికివేయును
> అయితే నా నీతి నిత్యము నిలుచును నా రక్షణ తరతరములుండును.

"ఉపదేశము నా యొద్దనుండి బయలుదేరును" అని దేవుడు సెలవిచ్చాడు (4 వచనం). ఈ ఉపదేశము దేవుని చిత్తమును ప్రకటించుచున్నదై మానవుడు దేవుని యెడల కలిగియుండవలసిన విధేయతను కనుపర్చుచున్నది. ఇది "సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు, అనాది నుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము, నిత్యదేవుని ఆజ్ఞ ప్రకారము ప్రవక్తల లేఖనముల ద్వారా, వారికి తెలుపబడిన ... యేసు క్రీస్తును గూర్చిన ప్రకటనయై యున్నది" (రోమీయులకు 16:25, 27).

ఈ వాక్యభాగములో "నీతి" మరియు "రక్షణ" (5 వచనం) సమాంతరముగా సాగుచున్నవి. మానవుల విషయంలో, నీతి అనగా దేవుని నీతిమంతమైన ప్రమాణమునకు సరితూగుట. దేవుని విషయంలో, ఆయన తన కార్యములన్నిటిలో కనుపర్చు ప్రధానమైన లక్షణమై యున్నది. రక్షణ అనగా విముక్తి. ఇక్కడ యెషయా రాబోవుచుండిన బబులోను దాసత్వము నుండి కలుగు విముక్తి గూర్చి చెప్పుచున్నాడా లేక సేవకుని ద్వారా కలుగు పాప విముక్తి గూర్చియా? ఇది పైన జెప్పిన రెండింటిని సూచించవచ్చును, కానీ ఈ వచనము ఎక్కువగా క్రీస్తు ద్వారా కలుగు రక్షణను సూచించుచున్నదని హోమర్ హెయ్‌లీ చెప్పుచున్నాడు.[2]

5వ వచనములోని ఇతివృత్తమును కొనసాగించుచూ, "నీతి" మరియు "రక్షణ" నిరంతరము నిలిచియుండునవై యున్నవని ప్రవక్త చెప్పుచున్నాడు (6 వచనం). ఏదిఏమైనా, "భూమి" మరియు ("ఆకాశము") నిరంతరము నిలిచియుండవు. ఇదే సత్యమును పేతురు కూడ తెలియజెప్పుచున్నాడు:

> అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును.

> భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహావేండ్రముతో కరగిపోవునట్టియు, దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశములకొరకును క్రొత్త భూమికొరకును కనిపెట్టు చున్నాము; వాటియందు నీతి నివసించును (2 పేతురు 3:10–13).

“నీతి అనుసరించువారలారా, నా మాట వినుడి, నా బోధను హృదయమందుంచుకొన్న జనులారా, ఆలకించుడి” అని దేవుడు సెలవిచ్చుచున్నాడు (7 వచనం). “అనుసరించుట” (తెలిసికొనుట) మేధావి సంబంధమైన తెలివిని మించినదై యున్నది. దానితో కూడ ఒకరు దేవుని నీతిమంతమైన జీవితములోనికి ప్రవేశించిన సన్నిహిత సంబంధము కలిగియుండును. ఇది “నా (దేవుని) బోధను (ధర్మశాస్త్రమును) హృదయమందుంచుకొనిన ప్రజల” చేత సాధించబడును. “హృదయము” భావోద్వేగములకును తెలివితేటలకును స్థానమైయున్న తావును సూచించుచున్నది. “నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మాతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను” అని మోషే మరియు యేసు ప్రభువు కూడ దేవుని ప్రజలను విజ్ఞప్తి చేసారు (ద్వితీయోపదేశకాండము 6:5; మత్తయి 22:37; మార్క 12:30). “నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము” అని సొలొమోను సామెతల గ్రంథంలో అన్నాడు (సామెతలు 4:23). “నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము” అని కూడ సొలొమోను చెప్పుచున్నాడు (సామెతలు 3:5). “నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును” అని పౌలు చెప్పుచున్నాడు (రోమీయులుకు 10:10). “సంకల్పము మరియు చర్యల ద్వారా దానిని వ్యక్తముచేయుచూ, ఒకని హృదయములో (మనస్సు మరియు మనస్సును ప్రభావితముచేయు విషయాలలో) ధర్మశాస్త్రము (దేవుని ఉపదేశము) నిలిచియుండు రీతిలో మాత్రమే, వాడు నీతని తెలిసికొనగలడు” అని హెయ్‌లీ వివరించాడు.[3]

లోకము మరియు లోకములోని మూలకములు గతించిపోవును, అలాగే ఇశ్రాయేలును దూషించువారు సహితము చిమ్మెట తినివేసిన వస్త్రమువలె అగుదురు.[4] ఏదిఏమైనా, దేవుని నీతి మాత్రం నిరంతరము నిలిచియుండును (8 వచనం). ఆయన “రక్షణ” “అన్ని తరములవారికి” అందుబాటులోఉన్నది.

## “విమోచింపబడినవారు తిరిగి వత్తురు” (51:9-16)

### దేవుని బలము (51:9-11)

యెహోవా బాహువా, లెమ్ము లెమ్ము బలము తొడుగుకొమ్ము
పూర్వపుకాలములలోను పురాతన తరములలోను లేచినట్లు లెమ్ము
రాహాబును తుత్తునియలగా నరికి వేసినవాడవు నీవే గదా?
మకరమును పొడిచినవాడవు నీవే గదా?
అగాధ జలములుగల సముద్రమును ఇంకిపోజేసిన వాడవు నీవే గదా?
విమోచింపబడినవారు దాటిపోవునట్లు
సముద్రాగాధ స్థలములను త్రోవగా చేసినవాడవు నీవే గదా?
యెహోవా విమోచించినవారు సంగీతనాదముతో సీయోనునకు తిరిగి వచ్చెదరు
నిత్యసంతోషము వారి తలలమీద ఉండును
వారు సంతోషానందము గలవారగుదురు
దుఃఖమును నిట్టూర్పును తొలగిపోవును.

"రాహాబు" (9 వచనం) అను పేరు ఐగుప్తును సూచించుటకు యెషయా ఉపయోగించుచున్న ఒక నామమై యున్నది (30:7; కీర్తనలు 89:10 చూడుము). ఈ వాక్యభాగము నిర్గమము యొక్క ఇతివృత్తమును ప్రధానాంశముగా కలిగియున్నదని స్పష్టమగుచున్నందునబట్టి ఇక్కడ పేర్కొనబడిన "మకరము" ఫరో రాజును సూచించుచున్నదై యున్నది (యెహెజ్కేలు 29:3). నిర్గమము సమయంలో ఇశ్రాయేలీయులు ఎర్ర సముద్రమును అద్భుతకరమైన రీతిలో దాటిపోవుట (10 వచనం) దారుణమైన పరిస్థితులలో దేవుడు తన ప్రజలను కాపాడునిమిత్తము కలిగియున్న శక్తిసామర్థ్యములను ప్రదర్శించుచున్నది (నిర్గమకాండము అధ్యాయము 14).

"గనుక దేవుడైన యెహోవాచేత విమోచింపబడినవారు తిరిగి వత్తురు" (11 వచనం). ఇంతకు మునుపే ఇచ్చిన ఒక సంతోషభరితమైన వాగ్దానమును యెషయా ఇక్కడ పునఃరుక్తంగావించుచున్నాడు:

> శేషము తిరుగును, యాకోబు శేషము బలవంతుడగు దేవునివైపు తిరుగును (10:21).

> యెహోవా విమోచించినవారు పాటలు పాడుచు తిరిగి సీయోనునకు వచ్చెదరు, వారి తలల మీద నిత్యానందముండును వారు ఆనందసంతోషములు గలవారై వచ్చెదరు. దుఃఖమును నిట్టూర్పును ఎగిరిపోవును (35:10).

ఇశ్రాయేలీయులు వారి స్వదేశమునకు తిరిగి వత్తురని క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దములోనే యెషయా ముందుగా తెలియజెప్పాడు, అలాగే ఇదే విషయాన్ని యిర్మీయా రెండు వందల సం. తరువాత తెలియజెప్పాడు:

> నా సేవకుడవైన యాకోబూ, భయపడకుము ఇశ్రాయేలూ, జడియకుము దూరములోనుండి నిన్ను రక్షించుచున్నాను వారున్న చెరలో నుండి నీ సంతతివారిని రక్షించుచున్నాను ఎవరి భయమును లేకుండ యాకోబు తిరిగి వచ్చును అతడు నిమ్మళించి నెమ్మదినొందును (యిర్మీయా 46:27).

### దేవుని ఓదార్పు (51:12–16)

ఆయన వారిని చేసాడనియు విశాలవిశ్వమంతటిని ఆయన సృజించాడనియు దేవుడు తన ప్రజలకు గుర్తుచేయుట ద్వారా ఆయన వారిని ఓదార్చాడు. దేవుడు వారిని కాపాడుచుండగా కేవలము నరమాత్రులైన వారినిబట్టి వారెందుకు భయపడాలి? దేశబహిష్కృతులైనవారు సహితము విడిపింపబడి ఆహారమును సమృద్ధిగా కలిగియుందురు. "నా జనము నీవే" యని దేవుడిచ్చుచుండిన అభయముతో నెమ్మదిగలవారై యుండవచ్చును (16 వచనం).

> నేను నేనే మిమ్ము నోదార్చువాడను<br>
> చనిపోవు నరునికి తృణమాత్రుడగు నరునికి ఎందుకు భయపడుదువు?<br>
> బాధపెట్టువాడు నాశనము చేయుటకు సిద్ధపడునప్పుడు<br>
> వాని క్రోధమునుబట్టి నిత్యము భయపడుచు,<br>
> ఆకాశములను వ్యాపింపజేసి<br>
> భూమి పునాదులను వేసిన యెహోవాను<br>
> నీ సృష్టికర్తయైన యెహోవాను మరచుదువా?

బాధపెట్టువాని క్రోధము ఏమాయెను?
క్రుంగబడినవాడు త్వరగా విడుదల పొందును
అతడు గోతిలోనికి పోడు చనిపోడు
అతనికి ఆహారము తప్పదు.
నేను నీ దేవుడనైన యెహోవాను
సముద్రముయొక్క కెరటములు ఘోషించునట్లు దాని రేపువాడను నేనే.
సైన్యములకధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు.
నేను ఆకాశములను స్థాపించునట్లును
భూమి పునాదులను వేయునట్లును
నా జనము నీవేయని సీయోనుతో చెప్పునట్లును
నీ నోట నా మాటలు ఉంచి నా చేతినీడలో నిన్ను కప్పియున్నాను.

ఆంగ్లములో 12 మరియు 13 వచనముల భాషానిర్మాణం సరిగా అర్థమగునంత స్పష్టంగా లేదు. 12వ వచనములోని మొదటి "మిమ్ము" ద్వితీయ పురుష బహు వచనంలో ఉన్నది, అయితే ప్రవక్త 13వ వచనము వరకు ద్వితీయ పురుష ఏక వచనములో నుండి "నిన్ను"ను ఉపయోగించుచూ దానిని ప్రత్యేకించి పేర్కొన్నాడు. "వారిని ఓదార్చినవాడు ఆయనే" అని ప్రజలు తెలిసికొనవలెనను ఉద్దేశముగలవాడై దేవుడు సామాన్య పిలుపు నిచ్చుటతో మొదలుపెట్టాడు. "బాధపెట్టువానికి" భయపడుట వారు మానుకొనవలెనని ఆ తరువాత వ్యక్తిగత సవాలును వారి ముందుంచాడు. "నీవు భయపడుచున్నావంటే ఒక ప్రక్క నీవు అనుమానించుచున్నావనియు, మరొక ప్రక్క నీకు దేవుని యందు అపనమ్మకమున్నదనియు అర్థమగును" అని ఎడ్వర్డ్ జే. యంగ్ గమనించాడు[5]

సకల కాలములయందును సమస్తము దేవుని ఆధీనములోనే ఉన్నదని ప్రజలందరు జ్ఞాపకముంచుకొనవలెనని ఆయన అడిగిన ప్రశ్నలు వారిని మేల్కొల్పినవి. "ఆకాశములను వ్యాపింపజేసి భూమి పునాదులను వేసినవాడు" ఆయనే.

"క్రుంగినవాడు త్వరగా విడుదల పొందును" అని యెషయా చెప్పుచున్నాడు (14 వచనం). ఈ వచనము దేశబహిష్కృతులైనవారిని సూచించుచున్నదని కొందరు అభిప్రాయపడుదురు. ఏదిఏమైనా, ఇక్కడ చిత్రీకరింపబడిన విధంగానే బబులోనులో చెరగా నుండినవారు ఇంతటి దురవస్థను అనుభవించారను సూచన లేఖనములలో అగుపించుట లేదు. జే. అలెక్ మోటెయిర్ ఇలా వ్రాయుచున్నాడు,

> ఈ వచనము బబులోను చెరను సూచించుచున్నదని వ్యాఖ్యానకర్తలు చెప్పినప్పుడు వారు నిదర్శనము విషయములో బాహాటంగా అవినయం చూపుచున్నారు, ఏలయనగా చెరలో నుండినవారి జీవితము అది వర్ణింపబడుచున్నంత భరింపరానిదిగా లేకుండినదని మనకు తెలియుచున్నది (యిర్మీయా 29:4-7) మరియు పరిస్థితి వారు తమ స్వగృహములో ఉన్నంత సుఖవంతముగా ఉండుటనుబట్టి సీయోనుకు తిరిగి వచ్చుటకు కొద్దిమంది మాత్రమే సుముఖంగా ఉండిరి. బబులోనులో నివసించుచుండిన ప్రవక్త చెరలో ఉండిన వారి గూర్చి వర్ణించుచు ఈ వచనమును వ్రాసియుండునని ఊహించుటకైనను వీలులేనిదై యున్నది.[6]

ఈ ప్రకటన దేవుని ప్రజలు గురైన ఏ హింసాకాండనైనను (అష్షూరు, బబులోను, రోమా చక్రవర్తుల చేతిలో ఎదుర్కొన్న నిర్దాక్షిణ్య పరిపాలనను) మరియు అన్నిటిని మించిన

గొప్ప బానిసత్వమును – పాపమునకు బానిసలై యుండుటను – సూచింపవచ్చును. యేసు, "పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని సెలవిచ్చాడు (యోహాను 8:34). దీనంతటి అర్థమేమిటో భౌతికంగా బానిసలైయున్నవారు అర్థంచేసికొనగలరు. దురదృష్టవశాత్తు, పాపమునకు బానిసలైయున్న లక్షలాది మంది ఈ సత్యమును అర్థంచేసికొనడంలేదు.

"నేను నీ దేవుడనైన యెహోవాను" గనుక స్వేచ్ఛ వస్తుందని దేవుడు వాగ్దానం చేసాడు (15ఎ వచనం). ఈ వాస్తవమును ఆధారంచేకొని పరిశుద్ధ జీవతం గూర్చి మోషే ముందుగానే తెలియజెప్పాడు (లేవీయకాండము 19:1, 2).[7] ఈ గొప్ప సత్యమును గుర్తించువారు కచ్చితంగా ఓదార్పును కలిగియుందురు. "దేవుడు మన పక్షముననుండగా, మనకు విరోధి యెవడు?" అని పౌలు ప్రశ్నించుచన్నాడు (రోమీయులకు 8:31బి).

"నా జనము నీవే" (16 వచనం) అనునది సేవకుని గూర్చిన దైవికమైన ప్రకటనయై యున్నది. ఈ జ్ఞానోదయము "నీ నోట నా (దేవుని) మాటలు ఉంచి నా (దేవుని) చేతి నీడలో నిన్ను కప్పియున్నాను" అని సెలవిచ్చిన దేవుని నుండి కలిగినది. "ఈ వచనంలో రెండు (*ఉంచియున్నాను* మరియు *కప్పియున్నాను*) ధ్రువీకరణములు మరియు దేవుని ఉద్దేశములో గల మూడు ధాత్వర్థ పదములు – ఇన్‌ఫినిటీవ్‌స్ – క్రియ యొక్క సామాన్య రూపములు – ('స్థాపించునట్లు', 'వేయనట్లు', మరియు 'చెప్పునట్లును', ఉన్నవని మోటెయిర్ చెప్పుచున్నాడు)."[8] ఈ విధంగా వారు విడిపింపబడుదురను అభయము ఆయన ప్రజలు కలిగియుండిరి.

## "యెరూషలేమా, నేను నిన్నెట్లు ఓదార్చుదును?" (51:17–23)

### వారి విచారకరమైన పరస్థితి (51:17–20)

యెరూషలేమా, లెమ్ము లెమ్ము
యెహోవా క్రోధపాత్రను ఆయన చేతినుండి పుచ్చుకొని త్రాగినదానా,
తూలిపడజేయు పాత్రలోనిదంతటిని త్రాగినదానా, నిలువుము.
ఆమె కనిన కుమారులందరిలో ఆమెకు దారి చూపగలవాడెవడును లేకపోయెను.
ఆమె పెంచిన కుమారులందరిలో ఆమెను చెయి పట్టు
  కొనువాడెవడును లేకపోయెను.
ఈ రెండు అపాయములు నీకు సంభవించెను
నిన్ను ఓదార్చగలవాడెక్కడ ఉన్నాడు?
పాడు నాశనము కరవు ఖడ్గము నీకు ప్రాప్తించెను,
  నేను నిన్నెట్లు ఓదార్చుదును?
నీ కుమారులు మూర్ఛిల్లియున్నారు
దుప్పి వలలో చిక్కుపడినట్లు
వీధులన్నిటి చివరలలో వారు పడియున్నారు.
యెహోవా క్రోధముతోను నీ దేవుని గద్దింపుతోను వారు నిండియున్నారు.

"యెరూషలేము" "యెహోవా క్రోధపాత్రను" "మడ్డిని కూడా మిగిల్చకుండ త్రాగి" మద్యముతో మత్తురాలైయున్న ఒక స్త్రీ వలె చిత్రీకరింపబడినది (17 వచనం). "మడ్డి"

మద్యము సీసాలో అడుగుభాగాన మిగిలిపోయి యుండు మస్టు చుక్కలు, మద్యములోని అవాంఛనీయమైన భాగమై యున్నది. యెరూషలేము తన శత్రువుల యెదుట నిస్సహాయురాలుగాను నిరాయుధమై కాపుదలలేనిదిగాను పడియుండినది.

"ఆమె కనిన కుమారులందరు" దేవునిని విడిచిపెట్టినందు వలన ఆమెకు సహాయము చేయువాడొక్కడైనను లేకపోయెను (18–20 వచనాలు). వారు "యెహోవా క్రోధము"నకు కూడ పాత్రులగుదురు. దేవుడులేని మానవాళి బొత్తిగా ఎంత వైపరీత్యమైన నిస్సహాయ స్థితిలో ఉండునో అది ఇక్కడ చిత్రీకరింపబడి యున్నది.

### వారి దేవుడు వారి పక్షమున వ్యాజ్యెమాడును (51:21–23)

> ద్రాక్షారసములేకయే మత్తురాలవై శ్రమపడినదానా, ఈ మాట నినుము.
> నీ ప్రభువగు యెహోవా
> తన జనులనిమిత్తము వ్యాజ్యెమాడు నీ దేవుడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు
> –ఇదిగో తూలిపడజేయు పాత్రను నా క్రోధ పాత్రను
> నీ చేతిలోనుండి తీసివేసియున్నాను
> నీవికను దానిలోనిది త్రాగవు.
> నిన్ను బాధపరచువారిచేతిలో దాని పెట్టెదను
> మేము దాటిపోవునట్లు క్రిందికి వంగి సాగిలపడుమని వారు నీతో చెప్పగా
> నీవు నీ వీపును దాటువారికి దారిగాచేసి నేలకు దానిని వంచితివి గదా
> వారికే ఆ పాత్రను త్రాగనిచ్చెదను.

ఇక్కడ చిత్రీకరింపబడిన యూదులు "మత్తులై యుండిరి, కానీ ద్రాక్షారసముతో కాదు" (21 వచనం). వారికి మత్తెక్కించినది వారి పాపమే, పరిశుద్ధుడైన దేవునికి విరోధముగా వారు చేసిన తిరుగుబాటే వారి మత్తైయుండినది.

వారి రక్షణ వారి కుమారులలో లేదు, కానీ "తన జనుల నిమిత్తము వ్యాజ్యెమాడు దేవునిలోనే" ఉన్నది (22 వచనం). "వ్యాజ్యెమాడును" అని అనువదింపబడిన హెబ్రీ పదము న్యాయస్థాన పరిభాషయై యున్నది. ఈ పరిభాష నిశ్చయార్థకమైనదై లేదా వ్యతిరేకార్థమైనదై యుండవచ్చును. నిశ్చయార్థకమైన భావములో, దేవుడు వారి వ్యాజ్యెమును చేపట్టి వారి పక్షమున వాదించునని అర్థమగుచున్నది. "తూలిపడజేయు ఈ పాత్రను" ఆయన మాత్రమే తీసివేయగలడు. "ఆయన క్రోధ పాత్రను" ఆయన మాత్రమే తొలిగించగలడు. యూదాలో నుండి ఆయన దీనిని తీసివేసినప్పుడు మనము ఈ విషయమును చూడగలము. ఆయన "దానిని [యూదాను] బాధపరచువారిచేతిలో పెట్టును" (23 వచనం). దేవుడు దక్షిణ ప్రాంతములో గల రాజ్యముపై కలిగియున్న ఆయన క్రోధాంతమును ఈ వచనములు ముద్రవేయుచున్నవి.

---

సూచనలు

[1]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 403. [2]Homer Hailey, *A Commentary on Isaiah* (Grand Rapids, Mich.: Baker Book House, 1985; reprint, Louisville, Ky.: Religious Supply, 1992), 423. [3]Ibid.,

424. [4]యెషయా 50:9 మరియు మత్తయి 6:20 పోల్చి చూడుము. [5]Edward J. Young, *The Book of Isaiah,* vol. 3, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 315. [6]Motyer, 412. [7]లేవీయకాండము 19వ అధ్యాయంతో మొదలై, ఇశ్రాయేలీయులు ఒకరితో నొకరు ఎలా వ్యవహరించవలెనో వారికి తెలియజెప్పుటకు ఈ ప్రకటన తరుచుగా అగుపించుచుండును. దేవుడు ఎవరైయున్నారో అను దానిని బట్టియే మనము ఏమైయుండవలెనో మరియు ఏమి చేయవలెనో మనము తెలిసికొనగలము. [8]Motyer, 412.

---

# వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

## ❖❖❖ మిగిలియున్న కొద్ది మంది విశ్వసనీయులకు ఒక మాట ❖❖❖
## (అధ్యాయమ 51)

'శేషము' అయియుండినవారు, విశ్వసనీయులైన అల్ప సంఖ్యాకులు దేవునికి ఎల్లప్పుడు ఉండినారు. అధిక సంఖ్యాకులు చెడును వెంటాడుతూ వెళ్లిపోగా, కొద్ది మంది మాత్రమే నీతిని నిర్విరామముగా వెంటాడారు; తండోపతండాలుగా నాశనమునకు నడిపించు మార్గములో పయనమై వెళ్లిపోగా, పరిశుద్ధులలో దేవునికి విశ్వసనీయులైన కొద్ది మంది మాత్రం నిత్యజీవమునకు పోవు ఇరుకును సంకుచితమునైయున్న మార్గములో వెళ్లరు. 51వ అధ్యాయంలో, దేవుడు ఈ నీతిమంతులను, వారు అల్పసంఖ్యాకులైనను, వారి ద్వారా దేవుడు తన కార్యములను నిర్వహించు విశ్వాసుల సమూహమైయున్నవారిని ఉద్దేశించి వారికి ఓదార్పును కలుగజేయుచు ప్రోత్సాహమునిచ్చు మాటలు పలికాడు.

*"నా మాటలు వినుచుండుడి" అని దేవుడు వారికి సెలవిచ్చాడు.* "మీరు ఏ బండ నుండి చెక్కబడితిరో దాని ఆలోచించుడి, మీరు ఏ గుంట నుండి త్రవ్వబడితిరో దాని ఆలోచించుడి" అని ఆయన వారికి తెలియజెప్పాడు (1 వచనం); "నా ప్రజలారా, నా మాట ఆలకించుడి, నా జనులారా, నాకు చెవియొగ్గి వినుడి; ఉపదేశము నాయొద్ద నుండి బయలుదేరును, జనములకు వెలుగు కలుగునట్లుగా నా విధిని నియమింతును" (4 వచనం). దేవడు సెలవిచ్చు ఆదేశములన్నిటిని అనవరతము భక్తిగౌరవాలతో పాటించుట మత భ్రష్టతకు వ్యతిరేకముగా కాపుదలనిచ్చు అతి గొప్ప ఆశ్రయ దుర్గమును, ఆధ్యాత్మికతలో పురోగమనము చెందుటకు అతి గొప్ప వరమునై యున్నది.

*"నీతిమంతులు అల్ప సంఖ్యలో ఉండినప్పటికిని నేనెల్లప్పుడు వారి ద్వారానే కార్యములు జరిగించానని మీరు జ్ఞాపకముంచుకొనవలెను" అని దేవుడు వారికి సెలవిచ్చాడు.* సత్యవేదము చాటిచెప్పుచున్నదేమిటో మరొకసారి గమనించుము. "మీ తండ్రియైన అబ్రాహాము సంగతి ఆలోచించుడి, మిమ్మును కనిన శారాను ఆలోచించుడి. అతడు ఒంటరియై యుండగా నేను అతని పిలిచితిని, అతనిని ఆశీర్వదించి అతనిని పెక్కుమంది యగునట్లు చేసితిని" అని వ్రాయబడియుండుట మనము గమనించగలము (2 వచనం). నీవు చట్టూర చూచి దేవుని ఉద్దేశములను నెరవేర్చువారిని కొద్ది మందిని మాత్రమే చూచినప్పుడు, అది ఎల్లప్పుడు ఎలా ఉండినదో ఒకసారి ఆలోచించుము. నోవహు ఓడను నిర్మించుచుండినప్పుడు ఆయన దాదాపుగా ఒంటరిగానే ఆ పని చేసాడు; అబ్రాహాము మరియు శారా, దేవుని యెడల

నిబద్ధత కలిగియుండినవారు ఈ ఇద్దరే అయినప్పటికిని, వారు ఇశ్రాయేలు జనాంగమునకు పితామహులయ్యారు. తన చూట్టూర ఉండిన ప్రపంచమంతా అన్యుడైన రాజు జారీ చేసిన ఆజ్ఞకు లోబడుచుండగా, దానియేలు ఆయన తన గదిలో ప్రశాంతంగా ప్రార్థించాడు.

*"నా విశ్వసనీయత గూర్చి ఆలోచించుడి" అని దేవుడు వారికి సెలవిచ్చాడు.* ఆయన ప్రజలు సమస్త విధములైన విపత్తులను, హింసలను, మరియు పేదరికమును ఎదుర్కొన్నారు; కానీ దేవుడు వారి యెడల ఎన్నడైనను విశ్వాసపాత్రముకానివాడై యుండినట్లు ఎరుగరు. ఆయన వారితో కూడా మండుచుండిన ప్రతి అగ్నిగుండము గుండా నడిచాడు. "... నా రక్షణ నిత్యముండును, నా నీతి కొట్టివేయబడదు" అని ఆయన చెప్పుచున్నాడు (6 వచనం). భూమ్యాకాశములు గతించిపోవును గాని దేవుడు నిత్యుడుగా ఉంటూ వచ్చాడు, ఇక ముందు ఎల్లప్పుడు ఆయన నిత్యుడుగానే నిలిచియుంటాడు. ఆయనను ప్రేమించువారి యెడల ఆయన నిరంతరము నిలిచియుండు విశ్వాసపాత్రమును కలిగియున్నాడు.

*"నీవు ఒంటరిగా ఉండినప్పటికిని, నీవు భయపడాల్సిన పనిలేదు" అని దేవుడు వారికి సెలవిచ్చాడు.* ఆయనను సేవించువారి పక్షమున ఆయన తన శక్తిమంతమును ఉపయోగించును. "నీతి అనుసరించువారలారా, నా మాట వినుడి, నా బోధను హృదయమందుంచుకొన్న జనులారా, ఆలకించడి; మనుష్యులు పెట్టు నిందకు భయపడకుడి, వారి దూషణ మాటలకు దిగులుపడకుడి" అని ఆయన వారికి తెలియజెప్పాడు (7 వచనం). వారి హృదయమును ఆయనకు అంకితము చేసికొన్నవారిని దేవుడు ఎల్లప్పుడు కాపాడి సంరక్షించాడు. "అగాధ జనములుగల సముద్రమును ఇంకిపోజేసినవాడవు నీవే గదా? విమోచింపబడినవారు దాటిపోవునట్లు సముద్రాగాధా స్థలములను త్రోవగా చేసినవాడవు నీవే గదా?" అని మనము ఆయన గూర్చి చెప్పవచ్చును (10 వచనం). దేవుని శక్తిమంతము మరియు గతంలో ఆయన అనుగ్రహించిన కాపుదల ఆధారంగా, చెరలో నున్నవారు "సంతోషానందముతోను" "నిత్యసంతోషముతోను" సీయోనుకు తిరిగి వచ్చుటకు ఎదురుచూడవచ్చును (వచనము 11). వారిని ఓదార్చుటకు దేవుడు వారితో కూడ ఉండగా, వారు తృణమాత్రుడగు నరునికి భయపడవలసిన అవసరంలేదు (12 వచనం).

*"నేనిచ్చిన వాగ్దానములు వెంటనే నెరవేరుట నీవు చూడకపోవచ్చునని జ్ఞాపకముంచుకొనుము" అని దేవుడు వారికి సెలవిచ్చాడు.* దేవుడు తన వాగ్దానములను మాటతప్పకుండా నెరవేర్చుటకు నమ్మదగినవాడై యున్నాడు, కానీ అవి తన ఉద్దేశములకు పరస్పరము పొందికగా నుండునట్లును ఆయన యొక్క అనుకూల సమయంలోను నెరవేర్చబడును. ఇశ్రాయేలీయులు డెబ్బది సం. లు చెరగా నుండిరి (యిర్మీయా 25:11). చెర త్వరగా అంతమగునట్లును యెరూషలేము పట్టణము మరియు దేవాలయము పునఃనిర్మింపబడునట్లును విశ్వసనీయమైన శేషముగా నిలిచిపోయిన వారిలో అనేకులు చిత్తశుద్ధితో ప్రార్థించారు, కానీ దేవుడు వారి ప్రార్థనలకు వెంటనే ప్రత్యుత్తరమీయలేదు. "క్రుంగబడినవాడు త్వరగా విడుదల పొందును, అతడు గోతిలోనికి పోడు చనిపోడు, అతనికి ఆహారము తప్పదు" అని అయన చెప్పాడు (14 వచనం). వారి ప్రార్థనలకు సరైన సమాధాము సరైన సమయములో ఇవ్వబడును. విశ్వసనీయులైనవారు దేవుడు వారి యెడల విశ్వసనీయుడై యుండనట్లు ఆయన కొరకు వారు వేచియుందురు.

విశ్వసనీయులైన కొద్ది మందికి దేవుడేమని సెలవిచ్చుచున్నాడు? "నా మాట

ఆలకించుచునే యుండుడి. మీరు ఎప్పుడూ చేయుచున్నట్లుగానే దానిని మీ హృదయములకు హత్తుకొని యుంచుకొనుడి. నా కార్యములు సర్వసాధారణంగ చాలా మంది చేత కాదు గాని, కొద్ది మంది ద్వారానే జరుగునని జ్ఞాపకముంచుకొనుడి. నేను మీ యెడల ఎల్లవేళలయందును విశ్వాసపాత్రమైనవాడనుగా ఉందును, గనుక మీరు ఎవరికైనను దేనికైనను భయపడవలసిన పనిలేదు. నాకు మొరపెట్టిన యెడల నేను మీకు ప్రత్యుత్తరమిత్తును, కానీ నేను ఎల్లప్పుడు మీరడిగిన వెంటనే సమాధానమీయను. నేను నా సంకల్పముల పరిధిలో మీకు సమాధానమిచ్చెదనని" ఆయన సెలవిచ్చుచున్నాడు.

మనలో "దేవునికి 'ఇష్టుడు' లేక 'ఇష్టురాలు' అని ఎవరూ లేరు, కానీ ఆయనకు సన్నిహితులై యున్నవారున్నారు," అని చెప్పబడినది. విశ్వసనీయులైనవారు దేవునికి కొద్ది మంది ఉన్నారు గనుక ఆయన వారి నిమిత్తమును వారి ద్వారాను తన ఉద్దేశములను నెరవేర్చుకొనును.

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖ అబ్రాహాము మరియు శారా సంగతి ఆలోచించుట ❖❖❖
### (51:1)

యెషయా 51వ అధ్యాయంలో ఇశ్రాయేలు "మీరు ఏ బండనుండి చెక్కబడితిరో మరియు ఏ గుంట నుండి త్రవ్వబడెనో" యని ఆలోచించుటగూర్చి ఆసక్తికరమైన ఒక అంశము కలదు (1 వచనం). వారు ఒకసారి అబ్రాహాము మరియు శారా సంగతి ఆలోచించవలెనని యెషయా ప్రజలకు చెప్పుచుండెను. కల్దీయుల దేశమునకు సంబంధించిన ఊరి నుండి అబ్రాహాముతో కూడ బయలుదేరి వచ్చిన వారి సంఖ్య చాలా చిన్నది. అదే విధంగా, బందీలుగా నుండినవారిని దేవుడు బబులోనులో నుండి బయటకు తోడుకొని వచ్చుచుండెను. వారు ఎక్కువ మంది లేరు, కానీ ఆ కొద్ది మందితోనే దేవుడు ఒక గొప్ప జనాంగమును లేవదీయును.